andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 40.1, కనిష్టం 27.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 5 ఏప్రిల్ 2024



లక్ష్యాన్ని మించిన ఆదాయం



భైంసా మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న కొనుగోళ్లు

భైంసా, ఏప్రిల్ 4 : గత కొన్ని సంవత్సరాలుగా వార్షిక ఆదాయ లక్ష్య సాధనంలో వెనుకబడిన మార్కెట్ కమిటీలు ఈ ఏడు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సాధించాయి. ప్రతికూల పరిస్థితులతో గత నాలుగు సంవత్సరాలుగా ఆదాయంలో చతికిలపడ్డ మార్కెట్ కమిటీలు ఈ ఏడు వాతావరణం అనుకూలించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో కోలుకున్నాయి. వార్షికలక్ష్యాన్ని అధిగమించి ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా ఇందులో భైంసా మినహా మిగతా 4 మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సాధించాయి. ఇక జిల్లా మొత్తం పరిశీలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరములో జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల వార్షిక ఆదాయలక్ష్యం రూ.14.62 కోట్లు నిర్దేశించడింది. అయితే వార్షిక సంవత్సరం ముగింపు సమయానికి జిల్లాలోని మార్కెట్ కమిటీల ద్వారా రూ.15.97 కోట్లు ఆదాయ చేకూరింది. వార్షికలక్ష్య ఆదాయం కంటే అదనంగా రూ.1.35 కోట్లు ఆదాయం సమకూరింది.

● కోలుకున్న మార్కెట్ కమిటీలు

జిల్లాలో భైంసా, నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్, కుభీర్‌లలో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. భైంసా, కుభీర్ మార్కెట్ కమిటీలకు ప్రధాన ఆదాయం పత్తి క్రయ, విక్రయాలపై సెస్సు రూపంలో సమకూరుతుండగా నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా వరి, పసుపు, పత్తి ద్వారా ఆదాయం వస్తోంది. అయితే గత నాలుగు సంవత్సరాలలో ప్రతికూల పరిస్థితుల మూలంగా పంటలు దెబ్బతిని వ్యవసాయోత్పత్తుల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో నాలుగు సంవత్సరాలుగా దిగుబడులు ఆశించిన మేర రాకపోవడంతో మార్కెట్ కమిటీల పరిధిలో క్రయ, విక్రయాలు ఆశించిన మేర జరుగలేదు. దీనికి తోడు ప్రభుత్వరంగ సంస్థలు మినుములు, కందులు, శనగలు, సోయా, మొక్కజొన్న ఉత్పత్తులను భారీగా కొనుగోళ్లు చేశాయి. ప్రైవేట్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ ఫీజు ఉండగా ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేసిన దిగుబడులకు మార్కెట్ ఫీజును మినహాయించారు. నాలుగు సంవత్సరాలుగా మార్కెట్ కమిటీ ద్వారా జరిగిన కొనుగోళ్లకు సరిసమానంగా ప్రభుత్వరంగ సంస్థల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీల ఆధాయం తగ్గుముఖం పట్టి వెనుకబాటు కొనసాగుతోంది. అయితే ఈ ఏడు వాతావరణం అనుకూలించడంతో పలు రకాల పంటల దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. పలు వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరను మించి ధరలు లభించాయి. ఈ క్రమంలో నాలుగు సంవత్సరాలుగా వార్షిక ఆదాయ లక్ష్యసాధనలో చతికిలపడ్డ మార్కెట్ కమిటీలు 2023-24లో పూర్తిస్థాయిలో కోలుకుని లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సాధించాయి.

● 5 మార్కెట్ కమిటీల నుంచి రూ.1.35 కోట్ల అదనపు ఆదాయం

గడిచిన వార్షిక సంవత్సరములో జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలలో ఒక భైంసా మార్కెట్ కమిటీ మినహా నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్, కుభీర్ మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని సాధించాయి. జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీలకు వార్షిక ఆదాయలక్ష్యం రూ.14.62 కోట్లు నిర్దేశించబడగా రూ.1.35 కోట్ల అదనంగా ఆదాయాన్ని సాధించి మొత్తం రూ.15.97 కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి.

● మార్కెట్ కమిటీల వారీగా ..

భైంసా మార్కెట్ కమిటీ వార్షిక ఆదాయలక్ష్యం రూ.6.18 కోట్లు ఉండగా రూ.6.13 కోట్లు సాధించింది. ఇక, నిర్మల్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.4.61 కోట్లు ఉండగా రూ.5.52 కోట్లు, ఖానాపూర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.80 కోట్లు ఉండగా రూ.2 కోట్లు, సారంగపూర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.1.52 కోట్లు ఉండగా రూ.1.53 కోట్లు, కుభీర్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.51 లక్షలు ఉండగా రూ.78 లక్షలు సాధించాయి. భైంసా మార్కెట్ కమిటీ లక్ష్య సాధనలో 99.19 శాతం ఆదాయం సాధించగా మిగతా 4 మార్కెట్ కమిటీలు శత శాతాన్ని మించి ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. నిర్మల్ మార్కెట్ కమిటీ 19 శాతం, కుభీర్ మార్కెట్ కమిటీ 52 శాతం, సారంగపూర్ మార్కెట్ కమిటీ 1 శాతం, ఖానాపూర్ మార్కెట్ కమిటీ 11 శాతం అదనపు ఆదాయాన్ని సాధించాయి.

- జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీలు
- 2023-2024 వార్షిక ఆదాయ లక్ష్యం రూ.14.62 కోట్లు
- చేకూరిన ఆదాయం రూ.15.97 కోట్లు
- రూ.1.35 కోట్ల అదనపు ఆదాయం
- భైంసా మినహా ఆదాయ లక్ష్యాన్ని మించిన మిగతా 4 మార్కెట్ కమిటీలు

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ మంత్రి



పూజాఫలాన్ని అందుకుంటున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 4 : నిర్మల్‌లోని దత్తాత్రేయనగర్‌లో యంత్రోధారక ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి 65 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 4 : జిల్లాకేంద్రంలోని దత్తాత్రేయకాలనీలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి గురువారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు హాజరయ్యారు. ప్రత్యేకపూజలో పాల్గొని తీర్థ, ప్రసాదలు స్వీకరించారు. దత్తాత్రేయ కరుణాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు. నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, గణేష్, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కేశవసేవా సంఘు భవనానికి భూమి పూజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 4 : జిల్లాకేంద్రంలో కేశవసేవా సంఘ కార్యాలయ భవనానికి గురువారం హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతిస్వామి భూమిపూజ చేశారు. బీజేపీ శాసన సభాపక్ష నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ప్రాంత కార్యవాహ రమేష్ జి, జిల్లా సంఘ అధ్యక్షుడు నూకల విజయ్‌కుమార్, సహ సంఘ సంచలాక్ సాదుల కృష్ణ, నగర సంఘ సంచాలక్ డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, మంచిర్యాల నాగభూషణ్, దిగంబర్, గంగిశెట్టి ప్రవీణ్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా జునైద్ మెమన్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 4 : ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కోఆర్డినేటర్‌గా నిర్మల్‌కు చెందిన జునైద్ మెమన్ నియమితులయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అధిష్టానం అప్పగించిన బాధ్యత విశ్వాసంతో నెరవేరుస్తానని జునైద్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, తదితర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చెక్‌పోస్టును సందర్శించిన ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

తానూర్, ఏప్రిల్ 4 : మండలంలోని బేల్‌తరోడా అంతరాష్ట్ర చెక్‌పోస్టును గురువారం భైంసా ఏఎస్పి కాంతిలాల్‌పాటిల్ సందర్శించారు. చెక్‌పోస్టు వద్ద ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీలను ఆయన పరిశీలించారు. ఏవరైన అసంఘటిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లిక్కర్, మనీ రవాణాను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట పోలీసులున్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 4 : దివ్యాంగ ఉద్యోగులకు 2024 సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడుతూ... జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, అందుకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి మినహాయింపు కోసం లేఖను పంపించడం జరిగిందన్నారు.

రాజ్యాంగ రక్షణయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 4 : రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను గురువారం మాల మహానాడు జిల్లా నాయకులు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ... జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు కరపత్రాలు ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ముడుసు సత్యనారాయణ, పులి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలి



రాయపూర్ కాండ్లీలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, ఏప్రిల్ 4 : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి గణేష్ అన్నారు. గురువారం మండలంలోని రాయపూర్ కాండ్లీ, గొడిసెరా, బాగాపూర్ గ్రామాల్లో కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళారులను నమ్మి రైతులు మోసపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ నిర్వాహకులు నాళం గంగయ్య, దత్తు పటేల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

● నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 4 : ఎండాకాలం నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశహాల్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లతో కలిసి ఆయన జిల్లాలో త్రాగునీటి సమస్యలు, పరిష్కారం అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ... జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, 396 గ్రామ పంచాయతీలలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, క్షేత్రపరిశీలనలో నీటి కొరత ఇబ్బందులు ఏర్పడితే వెంటనే తగు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, సమీప బోరు బావుల ద్వారా నీరందించాలన్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్, ఇతరత్రా సమస్యలుంటే వెంటనే మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేయాలని సూచించారు. కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ మాట్లాడుతూ... జిల్లాలోని నీటి ప్రాజెక్టులలో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టులలో నీటి మట్టం గురించి సమాచారం అందించాలన్నారు. నీటి ఎద్దడి నివారణకై ప్రతీ గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించాలని, మిషన్ భగీరథ, నీటి బోరు బావులు, వంటి మార్గాల అవసరమైన ప్రాంతాలకు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, మిషన్ భగీరథ డీఈ సందీప్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 4 : ప్రభుత్వ నిబంధనలు పాటించని రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం సోన్ మండలం గంజాల్‌లోని రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లింగ్ ప్రక్రియ, ధాన్యం నిల్వలు, శుభ్రత, కెపాసిటీ తదితర వాటిని పరిశీలించారు. రోజువారీ మిల్లింగ్ లేబర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్‌వో నందిత కలెక్టర్ వెంట ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

దస్తూరాబాద్, ఏప్రిల్ 4 : మండల ఎంపీపీ సింగరికిషన్, జడ్పీటీసీ శారద శ్రీనివాస్, దస్తూరాబాద్ సర్పంచ్ నిమ్మతోట రాజమణి శివయ్య, బీజేపీ జిల్లా నాయకుడు మాజీ ఎంపీటీసీ దొనకంటిస్వామి, మల్లాపూర్ సర్పంచ్ భూమేష్, ఉప సర్పంచ్ భూక్యా నరేష్, రాజేశం, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



ఖానాపూర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ

ఖానాపూర్, ఏప్రిల్ 4 : వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ... రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లటి తాగునీటిని అందించడమే లక్ష్యంగా మున్సిపల్ ఆధ్వర్యంలో జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కావలి సంతోష్, మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు తోట సత్యం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కదార్ల గంగనర్సయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, కాంగ్రెస్ నాయకులు పరిమి సురేష్, షబ్బీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉదయం పూటనే పనులకు వెళ్లాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను నీటిలో కలిపి ఇస్తున్న దృశ్యం

కుంటాల, ఏప్రిల్, 4 : రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లి ఎండతీవ్రత పెరగకముందే ఇంటికి తిరిగి రావాలని ఎంపీడీవో రహీం అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాలలో ఉపాధిపనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు వెళ్లి కూలీలకు తాగునీటి సౌకర్యం గురించి అడిగి తెలుకొని నీడ కొరకు నెట్టును ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపాధికూలీలే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలు అత్యవసరమయితే తప్ప బయటకు వెళ్లకూడదని, వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈయన వెంట ఏపీవో నవీన్, పంచాయతీ సెక్రటరీ రాజాబాబు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



కుంటాలలోని పాఠశాలలో నాటక రూపంలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కుంటాల, ఏప్రిల్, 4 : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడడం వలన కలిగే అనార్థాల గురించి, పాత తరం రోజుల్లో ప్లాస్టిక్ వాడకం లేనందున మనుషులు ఆరోగ్య వంతంగా ఆయుష్మ ఎక్కువగా ఉండేదని విద్యార్థులకు సూచించారు. నేటి తరంలో ప్రతిరోజు నిద్రలేచినప్పటి నుంచి రాత్రి వరకు ప్రతి అవసరానికి ప్లాస్టిక్‌ను వాడుతున్నారని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని నాటక రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పీచర ప్రభుత్వ పాఠశాలకు విరాళం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 4 : మండలంలోని పీచర ప్రభుత్వ పాఠశాలకు స్థానిక నివాసి, హైదరాబాద్ సెటిలర్ ఎర్ర మచ్చేందర్‌రెడ్డి రూ. 50 వేలను గురువారం విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తంలో గ్రంథాలయానికి పుస్తకాలు, బీరువా, విద్యార్థులకు ప్లేట్స్, దుస్తులను కొనుగోలు చేసి తహసీల్దార్ జానకి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎర్ర లింగమ్మ - రాజేశ్వర్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వీటిని అందజేసినట్లు వారు తెలిపారు.

కుభీర్‌లోని పాఠశాలకు ..

కుభీర్, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డా. మహిపాల్ రూ. 50వేలు విరాళంగా అందజేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో మండిపోతున్న ఎండలు

● బేలలో అత్యధికంగా 42.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు ● బయటకు వెళ్లేందుకే జంకుతున్న జిల్లావాసులు


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి


ఎండ తీవ్రతకు గొడుగు సహాయంతో చిరు వ్యాపారులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో మండిపోయే ఎండలతో జనం అంతలాకుతలమవుతున్నారు. ఉదయం 9 గంటలు దాటితే బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. గురువారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలు కాగా.. కనిష్టంగా 27.5 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా బేల మండలం చప్రాలలో 42.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్ధలో 41.8, ఆదిలాబాద్అర్బన్‌లో 41.3, మావల మండలంలో 40.9, సిరికొండ మండలంలో 40.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చాలా చోట్ల రికార్డు స్థాయిలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ యేడు మార్చి నెలలోనే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఏప్రిల్ ప్రారంభంలో మరింత ఎండల తీవ్రత కనిపిస్తుంది. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. మధ్యాహ్న సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటి వరకు జిల్లాలో ఇద్దరు ఎండదెబ్బబారీన పడి స్వల్ప అస్వస్థతకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు.



గిరిజన యువకుడికి డాక్టరేట్

నేరడిగొండ, ఏప్రిల్ 4 : మండలంలోని సావర్‌గాం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు జాదవ్ కృష్ణకు గాడ్స్లస్‌హాల స్పిరిట్ అమెరికన్ యూనివర్సిటీ టెక్సస్ యూఎస్ఏ వారు గురువారం డాక్టరేట్ ప్రధానం చేశారు. జాదవ్‌కృష్ణ గత కొన్నేళ్లుగా ప్రజలకు చేస్తున్న సామాజిక సేవను గుర్తించి యూనివర్సిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.వరప్రసాద్, డాక్టర్ కె.మరియాకుమార్, రెఫరెండం డాక్టర్లు ఏఎస్ శ్రీనివాస్‌లు ఈ డాక్టరేట్ ప్రధానం చేశారు. వృత్తిరీత్యా జాదవ్‌కృష్ణ ఆర్ఎంపీ వైద్యుడు. గిరిజన యువకుడికి డాక్టరేట్ ప్రధానం చేయడంతో.. మండల వాసులు అతన్ని అభినందించారు.



చెట్టు కింద సేద తీరుతున్న మూగజీవాలు

ఎండకు విలవిలలాడుతున్న మూగజీవాలు

భైంసా, ఏప్రిల్ 4 : రోజురోజుకూ పెరుగుతున్న ఉదయభానుని ఉధృతితో మూగజీవాలు విలవిలలాడు తున్నాయి. మండే ఎండల దాటికి తట్టుకోలేక పశుజాతి పాట్లు పడుతున్నాయి. మేతకు వెళ్లిన పశువులకు సక్రమంగా గ్రాసం దొరకడం లేదు. దీంతో పశువులు అర్థాకలితో అలమటిస్తున్నాయి. కనీసం నీటితోనైనా కడుపు నింపుకుందామంటే వాటికి నీరు సైతం లభ్యం కావడం లేదు. మధ్యాహ్నం వేళలో మేతకు వెళ్లిన పశువులు సూర్యుని ప్రతాపనికి బెంబేలు పడిపోయి ఆయా ప్రాంతాల్లో గల చెట్లను ఆశ్రయిస్తున్నాయి. మండే ఎండల దాటితో జనాలతో పాటు మూగజీవాలు విలవిలలాడిపోతున్నాయి. పశువుల కాపరులకు పశుపోషణ భారంగా మారుతోంది. పశువులకు నీటిని, మేతను అందించేందుకు ఇబ్బందులు కావడంతో పశువులకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.



శిథిలమవుతున్న వ్యవసాయ శాఖ కార్యాలయం భవనం, గిడ్డంగి

శిథిలదశకు చేరుకుంటున్న

వ్యవసాయ శాఖ కార్యాలయం, గిడ్డంగిలు

ఉట్నూర్, ఏప్రిల్ 4 : ఉట్నూర్ ఏజెన్సీలోని రైతన్నలకు వ్యవసాయ సూచనలు సలహాలు ఇచ్చే ఉట్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం శిథిలదశకు చేరుకుంటుంది. గత ప్రభుత్వ హయాంలో నియోజక వర్గ కేంద్రానికి ఏడీఏ కార్యాలయాలను తరలించడంతో ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న ఏడీఏ కార్యాలయాన్ని కొత్తగా బోథ్ నియోజక వర్గంలోని ఇచ్చోడకు తరలించారు. ఉట్నూర్ మండలంలోని ఏడీఏ కార్యాలయాన్ని ఎత్తి వేయడంతో ఉట్నూర్ ఏజెన్సీ రైతులు ఆందోళన చెందారు. దీంతో ప్రభుత్వం ఉట్నూర్‌లోని మండల వ్యవసాయ అధికారికి అదనపు బాధ్యతలు ఏడీఏగా ఇచ్చినప్పటికి అధికారులు కాని సిబ్బంది కాని నియమించ లేదు. ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం దశాబ్దా కాలంగా మూతబడడంతో వృదాగా అలంకార ప్రాయంగా మారిపోయింది.దీని పక్కనే ఉన్న దశాబ్దాల క్రితం నిర్మించిన వ్యవసాయ గిడ్డంగి కూడా పనికి రాకుండా పోయింది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఉట్నూర్ ఏడీఏ కార్యాలయాన్ని పునరుద్ధరించి పూర్తిస్థాయి అధికారులు, సిబ్బందిని నియమించి ఉట్నూర్ ఇంద్రవెల్లి నార్నూర్ గాదిగూడ మండలాల రైతులకు సేవలు అందించాలని ఏజెన్సీ ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

'వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి'

జైనథ్, ఏప్రిల్4: జైనథ్ మండలంలోని ఆయా గ్రామాల్లో గల విద్యార్థులు, ఇతరులు ఎండ కాలం దృశ్య వడదెబ్బ తగలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సూచల అన్నారు. గురువారం జైనథ్ మండలంలో గిమ్మా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేషనల్ అయోడిన్ డెఫిసివసీ కంట్రోల్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మంది విద్యార్థులకు సాల్ట్ సర్వే చేయడం జరిగిందన్నారు. సాల్ట్, యూరిన్ సాంపిల్స్ ల్యాబ్‌కి పంపిచడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సూచల మాట్లాడుతు వడదెబ్బ లక్షణాలు ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఓఆర్ఎస్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మజ, ఏఎన్ఎంలు నీలరుక్మిణిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం.. ప్రజలకు అసౌకర్యం



ఇచ్చోడలో రహదారి పక్కనే ఉన్న వ్యాపార సాముదాయాల వద్ద చెత్తచెదారంతో నిండిన మురుగుకాలువ

ఇచ్చోడ, ఏప్రిల్4: ఇచ్చోడ గ్రామపంచాయితీ పరిధిలోని వ్యాపార సముదాయాల మధ్య పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వ్యాపార సముదాయాల మధ్య భారీగా మురుగు చేరింది. మరో ఎక్క చెత్తచేదారం ఎక్కడికక్కడే ఉండడంతో దోమల దాడి తీవ్రతరమైంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నెలల తరబడి మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, మురుగు కూపాలను తొలగించకపోవడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. దీంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

బోథ్‌లో

మంచినీటి ఎద్దడి లొల్లి

బోథ్, ఏప్రిల్ 4 : బోథ్ పట్టణ సమస్యల పరిష్కారానికి గాను ఏర్పాటు చేసి టీడీఎఫ్ వాట్సాప్ గ్రూపులో బుధవారం రాత్రి నుంచి మంచినీటి ఎద్దడిపై బోథ్‌కు చెందిన యువకులు నీటి ఎద్దడిపై పంచాయతీ ఈవోకు విన్నవిస్తున్నారు. 14, 15వ వార్డుల్లో నీటి ఎద్దడి ఉందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈవో అంజయ్యకు విన్నవిస్తున్నారు. అంతేగాక గతంలో గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు తీసుకున్న చర్యలపై వివరిస్తున్నారు. అనుభవజ్ఞులైన వారిని సంప్రదించి నీటి ఎద్దడి నివారణకై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించాలని ఈవోకు సూచిస్తున్నారు. నీటి ఎద్దడి నివారణపై వివిధ రాజకీయ పక్షాల వారితో కలిసి తగు నిర్ణయం తీసుకోవాలని గ్రామ ప్రముఖులు వివరిస్తున్నారు. ఏది ఏమైనా భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోతుండటంతో మండలంలో అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతుందని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడుతుందని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు.

బస్టాండ్ లేదు బస్సులు రావు.. చెట్టు నీడే దిక్కు

బోథ్, ఏప్రిల్ 4 : మండలంలోని నక్కలవాడ మర్లపల్లి నిగిరి, కంటేగాం తదితర గ్రామాల వారికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలలో ప్రయాణించాల్సి వస్తుంది. గతంలో రోడ్డు బాగా లేదని ఆర్టీసీ అధికారులు బస్సులను నిలిపివేశారు. అయితే గత రెండు నెలలుగా రోడ్డు పూర్తయిన ఆర్టీసీ అధికారులు బస్సు నడపడం లేదని ఈ ప్రాంత ప్రయాణీకులు వాపోతున్నారు. ప్రతిరోజు ఈ రూట్‌లో ఆయా గ్రామాల నుంచి దాదాపు 500 మంది నిర్మల్, ఆదిలాబాద్‌లకు ప్రయాణీస్తుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు బస్సు నడపకపోవడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. మరో వైపు ఆయా గ్రామాల బస్టాండ్‌లో బస్టాండ్ షెడ్‌ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఎండకు వర్షానికి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. అధికారులు ఆయా గ్రామాల వద్ద బస్టాండ్‌ల నిర్మాణం చేపట్టి ఈ రూట్‌లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కేజీబీవీ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో 59 మంది విద్యార్థులకు అస్వస్థత
- బుధవారం రాత్రి, ఉదయం వండిన పప్పును వేడి చేసి విద్యార్థులకు వడ్డించడంతోనే ఘటన
- గురువారం ఉదయం వరకు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డ ఎస్‌వో
- విషయం తెలుసుకుని ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి, మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేసిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు
- రంగంలోకి దిగి విద్యార్థుల పరిస్థితి సమీక్షించిన కలెక్టర్, న్యాయాధికారి
- విచారణ చేసి పాఠశాల ఎస్‌వో చింతపండు సునీతను, వంటమనిషి పద్మను విధుల నుంచి తొలగించాలని ఆదేశించిన కలెక్టర్
- క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎంఈవోకు ఆదేశం
- ఇటువంటి సంఘటనకు పునరావృతం కావద్దని హెచ్చరిక.. కఠిన మార్గదర్శకాలు జారీ..
- కేజీబీవీ ఇన్చార్జి ప్రత్యేక అధికారిగా అక్కడే పనిచేస్తున్న పీజీసీఆర్టీ అనంతుల వనిత నియామకం



మండల కేంద్రంలోని ముప్పై పడకల ఆసుపత్రిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న నిర్మల్ ఆర్డీవో, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 59 మంది విద్యార్థినులు అస్వస్థకు గురయ్యారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 26 మంది విద్యార్థులను గురువారం నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించామని తల్లితండ్రులు ఆందోళన చెందవద్దని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాలలో 162 మంది విద్యార్థులు..

కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి వరకు 212 మంది విద్యార్థులు ఉండగా ఇటీవలే 44 మంది పదవ తరగతి పరీక్షలు ముగియడంతో ఇళ్లకు వెళ్లిపోయారు. పాఠశాలలో మూడు తరగతులకుగానూ 168 విద్యార్థులు ఉండగా అందులోంచి ఆరుగురు విద్యార్థులు గైరాజరు కావడంతో 162 మంది విద్యార్థులకు బుధవారం ఆహారం వడ్డించారు. నిర్మల్ ఆసుపత్రిలో 28 మంది విద్యార్థులు, నర్సాపూర్ (జి) ముప్పై పడకల ఆసుపత్రిలో 23 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ చికిత్స పొందుతున్నారు. మిగతా విద్యార్థులను తల్లితండ్రులు ఇంటికి తీసుకువెళ్ళారు.

అస్వస్థత విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డ ఎస్‌వో..

మండల కేంద్రంలోని ముప్పై పడకల ఆసుపత్రిలో వైద్యులు, కేజీబీవీ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే సిబ్బంది చికిత్స అందించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం బయటకు పొక్కకుండా తల్లి తండ్రులకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ చింతపండు సునీత పాఠశాల వెలుపలకు రానివ్వక పోవడంతో జిల్లా డీసీసీ అద్యక్షులు కూచాడి శ్రీహరిరావు చొరవ తీసుకొని ఫోన్ ద్వారా విషయాన్ని జిల్లా ఎస్పీకి అందించడంతో తల్లితండ్రులను పాఠశాల వెలుపలకు అనుమతించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఉదయం ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించిన స్పెషల్ ఆఫీసర్ చింతపండు సునీతను విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. గతంలో వంట కార్మికులు, సిబ్బంది టిఫిన్‌బాక్సుల్లో ఆహార పదార్థాలు ఇంటికి తీసుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, గిర్దావర్ వేణుగోపాల్, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావ్, మండల నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, అజీమ్, మహేశ్ పరిశీలించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కకు ఫిర్యాదు..

విధుల్లో నిర్లక్షం వహించిన జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, కేజీబీవీ పాఠశాల ఎస్‌వో చింతపండు సునీత, సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీదేవిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్కకు జిల్లా డీసీసీ అద్యక్షుడు కూచాడి శ్రీహరిరావ్ చరవాణిలో ఫిర్యాదు చేశాడు.

అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శ

- మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్ ఆదేశం

నిర్మల్ కల్చరల్ : నర్సాపూర్(జి) మండలం కేజీబీవీ స్కూల్ విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పలువురు పరామర్శించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆసుపత్రిలో గురువారం విద్యార్థులను పరిశీలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థులను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

డీసీసీ అధ్యక్షుడు కె.శ్రీహరిరావు గురువారం ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా న్యాయాధికారి అజేశ్‌కుమార్
- ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ
- పత్తాలేకుండా పోయిన కేజీవీబీ పాఠశాల సిబ్బంది

నర్సాపూర్ (జి) : మండల కేంద్రంలోని ముప్పై పడకల ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతున్న కేజీవీబీ పాఠశాలకు విద్యార్థినులను గురువారం సాయంత్రం జిల్లా న్యాయాధికారి అజేశ్ కుమార్ పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి బాడీ టెంపరేచర్ చెక్ చేయాలని స్టాఫ్‌నర్సును ఆదేశించారు. బాధిత తల్లి దండ్రులు పాఠశాలలోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కుస్లి గ్రామానికి చెందిన దేవేందర్ తన పన్నెండేళ్ల కూతురు డెంగ్యూతో మరణించిందని అన్న కూతురు అస్వస్థతకు గురైందని టీవీలో చూసి వచ్చాం సమాచారం ఇవ్వకుండా కేజీవీబీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ చింతపండు సునీత తల్లి తండ్రులకు మనోవేదనకు కలిగించిందని తెలిపారు. గతంలో పాఠశాల వంట సిబ్బంది విద్యార్థులు తినే ఆహారాన్ని, మాంసాన్ని టిఫిన్‌బాక్సుల్లో ఇంటికి తీసుకుపోతున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. తనకు పన్నెండేళ్ల కూతు రు డెంగ్యూతో చనిపోతే అప్పటి నుంచి ఆ బాదను మరచిపోలేక పోతున్నానని తన అన్న కూతురు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థకు గు రైందని తెలిసి ఆసుపత్రి వచ్చామని వీరికి రక్తపరీక్షల చేసే సిబ్బంది మధ్యాహ్నం వరకు మాత్రమే ఉంటున్నారని సమస్యను తమరితో చెప్తే తీరుస్తారని ఆశతో చెబుతున్నా సారు అని కంటతడి పెట్టడంతో ఆ మాటలు విన్న జడ్జి మనసు చలించిపోయింది. అనంతరం కేజీబీవీ పాఠశాలను తనిఖీ నిమిత్తం వెళ్లగా పాఠశాలకు తాళం వేసి ఉండటంతో తిరిగి వెళ్లిపోయారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

కేజీబీవీ నర్సాపూర్ (జి) ఎస్.ఓ విధుల నుంచి తొలగింపు


కలెక్టర్ ఆదేశాల మేరకు కలుషిత ఆహార ఘటనకి కారణం అయి, విధుల పట్ల నిర్లక్షం వహించిన కేజీబీవీ ప్రత్యేక అధికారిణి చింతపండు సునీతను నిధుల నుంచి తొలగించామని జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఏ.రవీందర్‌రెడ్డి తెలిపారు. అలాగే వంట చేయడంలో నిర్లక్ష్యం వహించిన వంటమనిషి పద్మను కూడా విధుల నుంచి తొలగించామని ఆయన తెలిపారు. కేజీబీవీ నర్సాపూర్ (జి) ప్రత్యేక అధికారిణి చింతపండు సునీత, వంటమనిషి పద్మలపై క్రిమినల్ కేసులు నమోదుకు మండల విద్యాధికారిని ఆదేశించామన్నారు. కేజీబీవీ విద్యార్థినుల అస్వస్థతకు సంబంధించిన సమాచారాన్ని, జిల్లా యంత్రాంగానికి చేరవేయడంలో నిర్లక్షంగా వ్యవహరించిన సెక్టోరల్ అధికారిణి శ్రీదేవికి షోకాజ్ నోటీసు కూడా జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, జిల్లాలోని అన్ని కేజీబీవీల సిబ్బందికి ప్రత్యేకమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే కేజీబీవీ ఇన్చార్జి ప్రత్యేక అధికారిణిగా అక్కడ పనిచేస్తున్న పీజీసీఆర్టి అనంతుల వనితను నియమించామన్నారు. బుధవారం కేజీబీవీ నర్సాపూర్ (జి)లో అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థినులను మెరుగైన చికిత్స కోసం ఈరోజు ఉదయం 5 గంటలకు నిర్మల్ ఏరియా హాస్పిటల్‌కి తరలించి నిపుణులైన వైద్యబృందంచే చికిత్స అందించామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఏ.రవీందర్‌రెడ్డి తెలిపారు. 24 మంది విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడిందని ఆయన తెలిపారు. అయినప్పటికీ 24 గంటల వైద్యుల పర్య వేక్షణలో ఉంచి రేపు ఉదయం విద్యార్థులను ఆసుపత్రి నుంచి ఇళ్లకు పంపిస్తామన్నారు.



కేజీబీవీ పాఠశాల తనిఖీకి వెళ్లి తాళం వేసి ఉండటతో బయటే ఆగిపోయిన జిల్లా న్యాయాధికారి అజేషకుమార్, పోలీసులు

తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి

ఉమ్మడి ఆదిలాబాద్ అధికారులతో సమీక్ష సమావేశంలో ప్రత్యేక కార్యదర్శి ఐఅండ్‌సీఏడీ ప్రశాంత్ జీవన్‌పాటిల్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్



పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్ 4 : తాగునీటి పర్యవేక్షణ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కార్యదర్శి ఐఅండ్‌సీఏడీ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్ తాగునీటి సరఫరాపై గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహి ంచారు. అంతకు ముందు జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారికి పూలమొక్క అందించి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిసా, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తాలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరా పై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ట్రైయినీ కలెక్టర్ వికాస్‌మహాతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా నియమించిన ప్రత్యేక అధికారులు రోజు ఫీల్డ్‌లో ఉండి పర్యవేక్షించాలని, హాబిటేషన్ వారిగా రోజుకు 4, 5 జీపీలను పరిశీలించి నీటిసమస్యకు గల కారణాలను తెలుసుకుని నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి తక్షణమే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజులకొకసారి నీటి సరఫరా అవుతున్న హాబిటేషన్‌ల వివరాలు సమర్పించాలన్నారు. ముఖ్యంగా నీటి సమస్య ఎక్కువగా ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని,ఆ దిలాబాద్‌రూరల్, తాంసి, తలమడుగు, ఇంద్రవెల్లి, బోథ్, బజార్‌హత్నూర్ తదితర మండలాల్లో సమస్యల ఎక్కువగా ఉన్న చోట ప్రత్యేక శ్రద్ధ వహించి పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండి ప్రతీ రోజు అక్కడి నీటి సమస్యను గుర్తించి డైరీలో రాయలని సూచించారు.బోర్‌వెల్స్, మిషన్ భగీరథ నీరు,ఇంట్రా, పైప్‌లైన్, సంబంధించి రిపేర్ వర్క్స్, మేజర్ ప్రాబ్లమ్స్ తదితర అంశాల పై అంచనాల ప్రతిపాదనలను సోమవారం లోపు పంపాలని, గ్రామాల్లో ప్రజలు ఎవరు కూడా బావి దగ్గరకు వెళ్లి నీరు తీసుకోకూదని ట్యాంకర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి నీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన సేవలందించేందుకే సైబర్ వారియర్స్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



సైబర్ వారియర్స్‌కు ఫోన్లను అందిస్తున్న జిల్లా ఎస్పీ

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్4:సైబర్ క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రతీ ఒక్క పోలీసుస్టేషన్‌లో ఒక్కొక్కరి చొప్పున సైబర్ వారియర్స్‌ను జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం కేటాయించారు. సైబర్ వారియర్స్‌కి ప్రత్యేకంగా ఒక సెల్‌ఫోన్ సిమ్‌కార్డు అందజేసి సైబర్ వారియర్స్‌కు అండగా ఉండాలని తెలిపారు. సైబర్‌నేరం జరిగిన వ ఎంటనే 1930 ఫోన్‌నెంబర్‌కు, ఎన్సీఆర్‌బీ పోర్టల్‌లో, దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరం ద్వారా మోసపోయిన డబ్బును త్వరగా ఇప్పించే విధంగా నూతన పద్ధతిని సైబర్ వారియర్స్‌కు తెలియజేయడం జరిగిందని, పూర్తి అవగాహనతో కోర్టు ద్వారా వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఇది వరకే సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు ఎవరన్న ఉంటే వారి డబ్బు బ్యాంకులో ఫ్రిజ్ అయి ఉన్నట్లయితే సైబర్ వారియర్స్ మీకు ఉపయోగకరంగా వీలైనంతా త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్, సైబర్‌సెల్ ఇన్‌చార్జీ సింగజ్‌వార్ సంజీవ్‌కుమార్, ఎంఎ రియాజ్, జిల్లా సైబర్‌సెల్ వారియర్స్ పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా చేయనున్న నాయకులు.. త్వరలో కాంగ్రెస్ గూటికి ?

బోథ్, ఏప్రిల్ 4: బోథ్ నియోజకవర్గం పరిధిలో భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులు రాజీనామాలు చేస్తున్నారు. ఇప్పటికే నేరడిగొండ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు పార్టీకి రాజీనామా చేయగా గుడిహత్నూర్ మండలానికి చెందిన బీజేపీ మండల పార్టీ ఉపాధ్యక్షులు రాజీనామా చేయడం జరిగింది. కాఇగా బోథ్ నియోజకవర్గ పరిధిలోని బజార్హత్నూర్, బోథ్ మండలాల నుంచి బీజేపీ పార్టీకి చెందిన నాయకులు రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. జిల్లా స్థాయిలో బీజేపీ వాటికి చెందిన ఓ నాయకుడితో పాటు పలు మండలాలకు పార్టీ నాయకులు రాజీనామా చేయనున్నట్లు తెలిసింది. జిల్లాస్థాయిలో బీజేపీ వాటికి చెందిన ఓ నాయకుడితో పాటు పలు మండలాల పార్టీ నాయకులు రాజీనామా చేయనున్నట్లు సమాచారం. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఉండ టంతో పాటు రానున్న రోజుల్లో వారు పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రాజెక్టులో పాల్గొనడం అభినందనీయం



రాష్ట్ర స్థాయి ప్రాజెక్టులో పాల్గొన్న ఉట్నూర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఉట్నూర్, ఏప్రిల్ 4 : నిత్య జీవితంలో గణితం యొక్క ఉపయోగాలు అనే అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన విజ్ఞాన ప్రాజెక్టులో ఉట్నూర్ ప్రభుత్వం డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ జాడిరవికిరణ్ అన్నారు. గురువవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ప్రాజెక్టు రూపకల్పనలో సహకరించిన గణిత అధ్యాపకురాలు డాక్టర్ శ్రావణి, ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు పూజ, చంద్రకళ, నగేష్, శేఖర్, అమృత్‌లకుపార్టిసిపేషన్ సర్టిఫికేట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికి గణితం ఎంతో ఉపయోగపడుతుందని గణితం వల్ల ఉపయోగాల పై తమ కళాశాల విద్యార్థులు మంగళవారం హైదరాబాద్‌లోఇన రూసా రిసోర్స్ సెంటర్‌లో జిజ్ఞాస రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలలో పాల్గొన్నారన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చడం జరిగిందని పేర్కొన్నారు. నేటి ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లలో గణితంకి సంబంధించిన ప్రశ్నలు ఖచ్చితంగా ఉంటున్నాయన్నారు. అందుకు అనుగుణంగానే విద్యార్థులు అందరు గణితం సబ్జెక్టుని కష్టపడకుండా ఇష్టంతో చదివినప్పుడు అన్ని సాధ్యమవుతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఐ శ్రావణి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జె.సంగీత, శ్రీధరదేవి, రాణి, రాజశేఖర్, డా.రవీందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, జావిద్‌లు పాల్గొన్నారు.







బీఆర్ఎస్ అభ్యర్థి మార్పు?

- పునరాలోచనలో పడిన బీఆర్ఎస్ అధిష్ఠానం
- లంబాడా నేతను ఎన్నికల బరిలోకి దింపే అవకాశం
- పరిశీలనలో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ పేరు
- ఏకాభిప్రాయం కుదిరితే అభ్యర్థి మార్పు ఖాయం
- మారనున్న రాజకీయ సమీకరణలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో లంబాడా సామాజిక వర్గం నేతల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ఎన్నికల బరిలో దింపితే గెలిచే అవకాశాలు ఉంటాయన్న అంచనాలు పెరుగుతున్నాయి. ఈసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల టికెట్‌ల కోసం పోటాపోటీ కనిపించిన బీఆర్ఎస్ అధికారానికి దూరంకావడంతో ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశావహ నేతలెవరూ పెద్దగా ఆసక్తి చూపించినట్లు కనిపించలేదు. దీంతో గత్యంతరం లేక ఆసిఫాబాద్ మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కును ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ఖరారు చేసింది. కానీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ధీటైనా అభ్యర్థి కాదన్న వాదనలు విన్పిస్తున్నాయి. అయితే పార్లమెంట్ పరిధిలో కొంతకాలంగా ఆదివాసీ, లంబాడా తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగడం అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో లంబాడా సామాజిక వర్గం కొంత ఆగ్రహంతో ఉన్నట్లు కన్పిస్తోంది. ఏ ఒక్క పార్టీ లంబాడాల నాయకత్వాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు కనిపించలేదు. దీంతో లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతల్లో తీవ్రనిరాశ నింపింది. పార్టీలకు అతీతంగా ఉమ్మడి అభ్యర్థిని లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింపేందుకు ప్రయత్నాలు కూడా సాగాయి. కానీ సాధ్యం కాకపోవడంతో బీఆర్ఎస్ అధిష్ఠానంపై ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ లంబాడా అభ్యర్థికి అవకాశం ఇస్తే గెలిపించి తీరుతామన్న ధీమా కన్పిస్తోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా అభ్యర్థి మార్పుపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే పార్లమెంట్ పరిధిలో రాజకీయ సమీకరణల మార్పులు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లంబాడ ఓట్లకు గాలం..

ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో బీఆర్ఎస్ లంబాడా ఓట్లకు గాలం వేసే పనిలో పడింది. ఆ సామాజిక వర్గానికి మరింత దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తోంది. దీంతో లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతను లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింపాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ అభ్యర్థి మార్పు ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. పార్లమెంట్ పరిధిలో లంబాడా సామాజిక వర్గం ఓట్లు సుమారుగా లక్షా 50 వేల వరకు ఉంటాయని అంచనా వేస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆసిఫాబాద్ మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కును పార్టీ అభ్యర్థిగా ప్రకటించినా లంబాడా సామాజికవర్గం నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో బీఆర్ఎస్ అధిష్ఠానం అభ్యర్థి మార్పుపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కూడా అధికారంలో లేకపోవడంతో గెలుపుపై పెద్దగా ఆశలు లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాపై మంచి పట్టున్న లంబాడా నేతలెవరూ ప్రస్తుతం పార్టీలో లేక ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మార్పు జరిగితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు గట్టి పోటీ తప్పదన్న చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ మాత్రం సొంత పార్టీ క్యాడర్‌నే నమ్ముకుని ముందుకెళ్తున్న అభ్యర్థి మార్పు జరిగితే గెలుపు అవకాశాలు మెరుగు పడుతాయన్న వాదనలు విన్పిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్ గెలుపు అంత సులువైన పనేమీ కాకపోయినా త్రిముఖ పోటీలో బయట పడే అవకాశాలు ఉన్నాయన్న టాక్ విన్పిస్తోంది.

బీఆర్ఎస్‌కు టచ్‌లో మాజీ ఎంపీ..

బీజేపీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేసిన ప్రయోజనం లేకపోవడంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ బీఆర్ఎస్ పార్టీ పెద్దలతో టచ్‌లో ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంచి పరిచయాలు, పలుకుబడి ఉండడం అలాగే లంబాడా సామాజిక వర్గానికి చెందిన సీనియర్‌నేత కావడంతో మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ వైపే బీఆర్ఎస్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ధీటుగా మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్‌ను ఈసారి ఎన్నికల బరిలోకి దింపాలన్న ఆలోచనతో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరు ఆదివాసీలే కావడంతో లంబాడా సామాజికవర్గం నుంచి రాథోడ్‌రమేష్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటిస్తే ఆ వర్గం ఓట్లు గంపగుత్తగా బీఆర్ఎస్‌కే పడుతాయన్న అంచనాతో ఉన్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఆదివాసీ, లంబాడా తెగల మధ్యనే ప్రధాన పోటీ అన్నట్లుగా కన్పిస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించిన వ్యూహాత్మకంగా గెలిచేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. చివరి క్షణంలో అభ్యర్థిని మార్చి పొలిటికల్ హీట్‌కు తెరలేపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

నేతలతో మంతనాలు

పార్టీ అభ్యర్థి మార్పుపై బీఆర్ఎస్ అధిష్ఠానం పెద్దలు పార్లమెంట్‌స్థాయి నేతలతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆదివాసీఅభ్యర్థులకు ధీటుగా లంబాడా సామాజికవర్గానికి చెందిన నేతను ఎన్నికల బరిలో దింపితే ఫలితం ఎలా ఉంటుందనే దానిపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలను అధిష్ఠానం పెద్దలు హైదరాబాద్ పిలిపించి చర్చించినట్లు ప్రచారం సాగుతోంది. ఆసిఫాబాద్‌లో పార్టీ అభ్యర్థి కోవలక్ష్మి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కొంత వరకు ఆదివాసీల మద్దతు ఉంటుందని భావిస్తున్న అధిష్ఠానం బోథ్‌లో లంబాడాల ఓట్లు కలిసి వస్తాయన్న అంచనాతో ఉన్నట్లు తెలిసింది. ఈ రెండు నియోజకవర్గాల్లో మెజార్టీ సాధించి ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఆశించినస్థాయిలో ఓటర్ల మద్దతును కూడగడితే గెలుపుఖాయమని అంచనా వేస్తోంది. ఆదివాసీల ఓట్లను బీజేపీ, కాంగ్రెస్ తలోకొంత పంచుకున్న లంబాడా సామాజిక వర్గానికి చెందిన ఓట్లు గంపగుత్తగా తమకే పడుతాయని లెక్కలు వేసుకుంటోంది. రాజకీయంగా లంబాడాలకు ప్రాధాన్యతను ఇచ్చామని చెప్పుకునే అవకాశంకూడా ఉంటుందని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. త్వరలోనే నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే అభ్యర్థి మార్పు కచ్చితంగా ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్	సహర్
సా.6.35	ఉ.4.44



ఎవరిని చూడగానే దైవం గుర్తుకువస్తుందో అతడే మీలో ఉత్తముడు

సంక్షిప్త సమాచారం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్ 4: పట్టణంలోని రిక్షా కాలనీలో గురువారం నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. రామమందిర నిర్మాణానికి రూ.28 లక్షలు విరాళంగా అందజేసిన సుభద్రబాయిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిందని, అలాగే ఆదిలాబాద్‌లో కూడా రామ మందిరం నిర్మాణం జరిగిందని తెలిపారు. విగ్రహప్రతిష్ఠాపనలో జిల్లానాయకులు ఆదినాథ్, విజయ్, అశోక్, సూర్య, శివ, భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రామాలయ కమిటీ సమావేశం

బోథ్, ఏప్రిల్4: ఈనెల 17న జరగనున్న శ్రీరామ నవమి ఉత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించేందుకు ఈనెల 5న ఉదయం 10గంటలకు రామాలయంలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ జి.వి.రమణ, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇన్‌చార్జీ ఏడీఎంహెచ్‌వోగా కుడిమెత మనోహర్

ఉట్నూర్, ఏప్రిల్4: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇన్‌చార్జీ ఉమ్మడి జిల్లాఅదనపు ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కుడిమెత మనోహర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుంరబాలు ఇటీవల పదవీ విరమణ చేయడంతో రాష్ట్ర కుటుంబ సంక్షేమ వైద్యఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ మనోహర్‌కు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో ఆత్రంభాస్కర్ తన ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కూడా డాక్టర్ మనోహర్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు ఖుష్బు గుప్తా నియమించారు.

వనం వదిలి.. జనంలోకి రావాలి



- డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: కాలం చెల్లిన సిద్ధాంతాలతో వనంలోనే ఉండిపోయిన మావోయిస్టులు జనంలోకి రావాలని డీఎస్పీఎల్ జీవన్‌రెడ్డి పిలుపునిస్తూ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్, దాసరివార్ సుమన అలియాస్ సంగీతక్క వీరు జనంలోకి రావడానికి పోలీసులు ఎల్లవేళలా సహకరిస్తారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం పని చేసే నాయకులు, దళ సభ్యుల కోసం వారి కుటుంబ సభ్యులు ఎంతగానో ఎదురు చూస్తున్నారని, ఇప్పటికైనా కుటుంబ సభ్యుల కోసం మావోయిస్టు పార్టీని వీడిజన జీవన స్రవంతి లో కలిసి ప్రశాంతమైన జీ వనాన్ని గడపాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి అందే అన్నిరకాల ప్రతిఫలాలను అందజేసి, పునరావాసం కల్పించేలా పోలీసుశాఖ కృషి చేస్తుందని తెలిపారు. అడవుల్లో ఉండే గిరిజనులకు విద్య, వైద్యం, ఆర్థిక స్వావలంబన అందకుండా పురోగతికి అభివృద్ధికి అడ్డు పడకుండా ప్రభుత్వం కల్పించే పునరావాస కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని జనజీవనం స్రవంతిలో కలవాలని పేర్కొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్, ఏప్రిల్4: కూలీలు 100 రోజుల ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గిరిజాయి, ఇంద్రానగర్, కోసాయి ఉమర్దా, భద్దునాయక్ తండా గ్రామాల్లోకొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పనిక్షేత్రంలో పనిచేస్తున్న కూలీల హాజరును మాస్టర్లలో నమోదు చేశారు. కుటుంబంలో ఒకరి బదులు మరొకరు పనిచేయకూడదని చెప్పారు. పని చేసిన వారికే హాజరు నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తేనే పూర్తి భత్యం వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల మొదటి తారీఖు నుంచి జాబ్‌కార్డు కలిగిన ప్రతీఒక్కరికి నూతన ఆర్థిక సంవత్సరానికి 100 రోజుల పని దినాలు అందుబాటులో ఉన్నాయని, వీటన్నింటిని ప్రతీ కుటుంబం సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభపడాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండత తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు వేకువ జామునే పని ప్రదేశానికి రావాలన్నారు. అనంతరం బద్దునాయక్ తండాలో కూడుకుపోయిన మంచినీటి బావిని పరిశీలించారు. పనుల్లో భాగంగా మరమ్మతులు చేసేందుకు, నూతన నిర్మాణం కోసం వర్క్ అలాట్‌మెంట్‌చేసి వినియోగం లోకి తీసుకువస్తానని గ్రామస్థులకు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, టీఏ, ఎఫ్ఏ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న అధికారి

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 4: ప్రజలు నిర్భయంగా ఓటేయాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిసున్నట్లు తెలిపారు. గురువారం మండలంలోని పిట్ట బొంగురం గ్రామంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, దానికి పోలీసుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పిట్ట బొంగురం గ్రామంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ఉద్యోగులకు వెసులుబాటు

- కలెక్టర్‌రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 4: ఎసెన్షియల్ సర్వీస్ (ఏవీఈఎస్) ఉద్యోగులకు ఎలక్షన్ కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించినట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎసెన్షియల్ సర్వీస్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వేస్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్ ఆలిండియా రేడియో, విద్యుత్‌శాఖ, ఆరోగ్యం కుటుంబ సంక్షేమశాఖ, రాష్ట్రరవాణా సంస్థ, ఆహారం, పౌరసరఫరాల శాఖ, ఎస్ఏఎస్ఎల్, అగ్నిమాపక సేవ ఉద్యోగులు, పోలింగ్ డే కవరేజ్ కోసం ఈసీఐ ద్వారా అధికారం పొందిన మీడియా మిత్రులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే ఎసెన్షియల్ సర్వీస్ ఉద్యోగులు ఫారం-12డీ తీసుకుని వాటిని నింపి సంబంధిత శాఖల నోడల్ అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖల నోడల్ అధికారులు ఏప్రిల్ 15లోగా సమర్పించాలన్నారు. ఆదిలాబాద్, బోథ్ సెగ్మెంట్స్ ఎసెన్షియల్ సర్వీసెస్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి తిరుమల, జిల్లా వైద్యాధికారి నరేందర్,జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి హరింద్రకుమార్,జిల్లా సివిల్ సప్లయి కిరణ్‌కుమార్, డీఎం సుధారాణి, ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి, జనరల్ మేనేజర్ దేవదాస్, స్టేషన్ మాస్టర్‌రైల్వేకుముద్, రీజనల్ మేనేజర్ ఆర్టీసీ కల్పన పాల్గొన్నారు.



మాట్లాడుతున్నజిల్లా కలెక్టర్ రాజార్షిషా, పాల్గొన్న సిబ్బంది



కూలీల దగ్గరికి వెళ్లి ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉపాధిహామీ పనుల పరిశీలన

తాంసి, ఏప్రిల్4: మండలంలోని ఆయా గ్రామాలలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి పరిశీలించారు. హస్నాపూర్, పొన్నారి గ్రామాలలో ఆయన పర్యటించి ఉపాధి కూలీలు ఇప్పటివరకు చేపట్టిన పనులు ఏవిధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వారికి సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లుల విషయంలో కూలీలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని తెలిపారు.



శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 4: మండలకేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో ధర్మసింగ్, మార్కెట్ కమిటీ ఈవో రాజేశ్వర్‌లు శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనగ క్వింటాకు రూ.5,440 మద్దతు ధర అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు శనగ పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని కోరారు. ఈ సహకార సంఘం డిప్యూటీ సీఈవో తుమ్మల సునీల్, సిబ్బంది లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి కౌన్సిలర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కందిశ్రీనివాస్‌రెడ్డి

ఎంతో మందికి భవిష్యత్తు ఇచ్చింది కాంగ్రెస్సే

- కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్4: కాంగ్రెస్ ఎంతోమందికి భవిష్యత్తు ఇచ్చిందని ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ వార్డు నెంబర్ 3 కౌన్సిలర్ సాయిప్రణయ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో సాయిప్రణయ్‌తోపాటు ఆయన తండ్రి శంకర్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండుగ్యారంటీలను అమలుచేశారు. వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు 29వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని, 11వేలతో మెగా డీఎస్సీని వేశారని గుర్తుచేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ అడ్డిబోజారెడ్డి, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, నాయకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీటి ధార లేక కళాహీనంగా పొచ్చెర జలపాతం

నీటి ధార లేక.. బోసిపోయిన పొచ్చెర జలపాతం!!

బోథ్, ఏప్రిల్4: ఎండ తీవ్రతకు వాగులు ఎండిపోవడంతో నీటి ధార లేక పొచ్చెర జలపాతం బోసిపోతోంది. పొచ్చెర జలపాతం వద్దకు వచ్చే నీటి ప్రవాహం లేక సహజ అందాలు కనుమరుగయ్యాయి. నీటి ధార లేదని పర్యాటకులు సైతం రావడం లేదని స్థానికులు అంటున్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు

బోథ్, ఏప్రిల్4: మండల సరిహద్దుల్లో ఉన్న ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ, పోలీసులు అధికారులు తనిఖీలు చేపట్టారు. అటు మహారాష్ట్ర వైపు ఉన్న చెక్‌పోస్టులో మహారాష్ట్ర అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఘన్‌పూర్ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తెలంగాణ రాష్ట్ర అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

నిజాంపూర్‌లో రూ.లక్షా 42వేల పట్టివేత

జైనథ్, ఏప్రిల్4: మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ చెక్‌పోస్టులతో పాటు జైనథ్ ఫ్లయింగ్ స్క్వాడ్‌టీం టీంలీడర్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. నిజాంపూర్ గ్రామంలో చేపట్టిన వాహనాల తనిఖీలు చేస్తుండగా బేల మండలం ఆవల్‌పూర్ గ్రామానికి చెందిన ఇత్తడి సుశాంత్‌రెడ్డి కారు నెంబర్ టీఎస్01ఈఎల్ 8889లో రూ.లక్షా 42వేల 200 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఖాతాలో జమచేసినట్లు అధికారులు తెలిపారు.